క్లుప్తంగా

లేపాక్షి షోరూంలో ప్రత్యేక డిస్కౌంట్లు



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): లేపాక్షి వార్షిక క్లియరెన్స్, ఉగాది, రంజాన్ పండుగల సందర్భంగా వినియోగదారులకు ప్రత్యేకమైన డిస్కౌంట్లు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వ సంస్థ లేపాక్షి హ్యాండీ క్రాఫ్ట్స్ అమ్మకాలు ప్రారంభించిందని లేపాక్షి మేనేజర్ ఎం. సురేష్ ఓ ప్రకటనలో తెలిపారు. గాంధీనగర్‌లోని షోరూమ్‌లో హస్తకళ వస్తువులు, చేనేత వస్త్రాలపై 10 నుంచి 50 శాతం తగ్గింపు ధరలతో కళాకృతులు అందుబాటులో ఉంచిందన్నారు. కొండపల్లి, ఏటికొప్పాక, ఉడ్ కార్వింగ్ కళారూపాలు, చేనేత, మంగళగిరి కాటన్, కలంకారీ వస్త్రాలపై ప్రత్యేక తగ్గింపు ధరలలో వినియోగదారులకు అందుబాటులో ఉంచుతున్నామంటున్నారు. మార్చి 31 వరకు డిస్కౌంట్లు అందుబాటులో ఉంటాయన్నారు.

ముందస్తు జాగ్రత్తలతో చోరీల నియంత్రణ



విజయవాడస్పోర్ట్స్: ఇంటికి తాళం వేసి వేరే ప్రాంతాలకు వెళ్లే వ్యక్తులు లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టం(ఎల్‌హెచ్‌ఎంఎస్) యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలని సీసీఎస్ సీఐ అబ్దుల్ సలాం సూచించారు. కృష్ణలంకలోని ఆర్కే రెసిడెన్సీ నివాసితులకు ఇళ్లలో జరిగే దొంగతనాల నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలపై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. దొంగతనం జరిగిన తరువాత బాధ పడేకంటే ముందస్తుగానే జాగ్రత్తలు తీసుకోవడం మంచిదన్నారు. ఎల్‌హెచ్‌ఎంఎస్ యాప్ ఇంట్లోకి చొరబడిన దొంగను పట్టిస్తుందని చెప్పారు. ఇంటికి తాళం వేసి ఊరు వెళ్లాల్సిన పరిస్థితి వచ్చినపుడు దగ్గరలోని పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందిస్తే, పోలీసులు వచ్చి ఈ యాప్‌కు సంబంధించి పరికరాలు అమర్చుతారన్నారు. సోషల్ మీడియా ద్వారా జరుగుతున్న చోరీలు, డిజిటల్ అరెస్ట్ తదితర నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీఐ సూచించారు.

దేశంలో సామాజిక విప్లవం ప్రారంభమైంది



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): భారతదేశంలో సామాజిక విప్లవం మొదలైందని వక్తలు పేర్కొన్నారు. విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో స్టాలిన్ వర్ధంతి సందర్భంగా సామాజిక విప్లవ సదస్సు బుధవారం జరిగింది. సదస్సులో సోషలిస్ట్ కూటమి జాతీయ నేత ఎల్.జైబాబు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ మాట్లాడుతూ సామాజిక ఉద్యమం ద్వారానే అసమానతలు తొలగిపోతాయన్నారు. సామాజిక విప్లవం తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. ఇప్పటికే దేశంలో ప్రారంభమైందని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీలకు ప్రైవేటు రంగంలోనూ రిజర్వేషన్లు కల్పించాలని, అపుడే సామాజిక న్యాయం సాధ్యమవుతుందన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రజలకు మేలు జరిగే పరిస్థితులు కనిపించడం లేదన్నారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ప్రజల హక్కులను కాలరాస్తోందని చెప్పారు. సదస్సులో సోషలిస్ట్ కూటమి రాష్ట్ర కార్యదర్శి పొదిల వెంకట్రావు, ఆర్టీఐ ఫోరమ్ జాతీయ అధ్యక్షుడు పత్తిపాటి చంద్రమోహన్, ఇఫ్టూ రాష్ట్ర కార్యదర్శి ఎం.రామకృష్ణ, అడపా మోహన్, ప్రజా అధికార పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ములింటి సుదర్శన్, బసవయ్య, అశోక్, అంగడాల పూర్ణ, శ్రీనివాస్ జల్లి, వసంత జల్లి, కార్ల్ మార్క్స్, పద్మారావు, పుల్లారావు, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

మధురంగా సినీ సంగీత విభావరి



విజయవాడకల్చరల్: భానుశ్రీ మ్యూజికల్ ఈవెంట్స్, ఫెండ్స్ ఆర్కెస్ట్రా ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో బుధవారం నిర్వహించిన సినీ సంగీత విభావరి మధురంగా సాగింది. మనసే అందాల బృందావనం పేరుతో సాగిన కార్యక్రమంలో తెలుగు, హిందీ చిత్ర గీతాలతో పాటు మెలోడీస్, మహిళలను చైతన్యపరిచే గీతాలు ఆలపించారు. సీనియర్ గాయకుడు సయ్యద్ ఆలీ మాట్లాడుతూ మహిళల ప్రగతిని స్వాగతించాలని సూచించారు. దేశ ప్రగతిలో మహిళల భాగస్వామ్యం వెలకట్టలేనిదన్నారు. ఇందు నారాయణ, శిరీషా పట్నాయక్, వికాస్, కృష్ణదాస్, ఫణి, సత్యనారాయణ పాల్గొన్నారు. గాయనీ గాయకులను నిర్వాహకులు ఘనంగా సత్కరించారు.

ప్రమాదకరంగా

కట్ట రోడ్డు

- రహదారి పొడవునా పగుళ్లు
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు
- మరమ్మతులు చేపట్టాలని వినతి



రోడ్డు మధ్యలో ఏర్పడిన పగుళ్లు

పాయకాపురం(విజయవాడరూరల్): విజయవాడ శివారు ప్రాంత కట్ట రోడ్డు పెద్ద పెద్ద గుంతలు పడి ప్రమాదకరంగా మారింది. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన వెంటనే రహదారులు అభివృద్ధి చేస్తామని, రోడ్లు అద్దంలా చేసి చూపెడతామని చెప్పిన పాలకులు ఈ రోడ్డును ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఎల్‌బీఎస్‌నగర్, పటేల్‌నగర్, సుందరయ్యకాలనీ కట్ట ప్రజలు, ఎల్‌ఐజీ కాలనీ, ఈడబ్ల్యూఎస్ కాలనీ వాసులతో పాటు ఉడా కాలనీ ప్రజానీకం నిత్యం ఈ రహదారిపై రాకపోకలు సాగిస్తుంటారు. పాతపాడు గ్రామం నుంచి వచ్చే ప్రజలు, అంబాపురం గ్రామంలోని జన్మభూమి రోడ్డుకు అనుసంధానంగా ఉన్న ఈ రోడ్డు ఎప్పుడు రద్దీగా ఉంటుంది.

వీఎంసీ చర్యలు శూన్యం..

వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఎమ్మెల్యే మల్లాది విష్ణు ఆర్థిక సంఘం నిధులు కోటి 20 లక్షల రూపాయలతో పైపులరోడ్డు నుంచి(ఆహ్వానం కల్యాణ మండపం) రెండు కిలోమీటర్ల పొడవు రోడ్డును అభివృద్ధి చేయించారు. అప్పటి హోంమంత్రి తానేటి వనితచే 2023లో రోడ్డును ప్రారంభింపచేశారు. నాలుగు కిలోమీటర్ల పొడవు గల రోడ్డు లో రెండు కిలోమీటర్ల మాత్రమే అభివృద్ధి జరగగా మిగిలిన రెండు కిలోమీటర్ల రోడ్డు అధ్వానంగా ఉంది. అడుగడుగునా గుంతలు పడి కనీసం ద్విచక్రవాహనం కూడా సాఫీగా నడిచే పరిస్థితి లేదు. కార్లు, ఆటోలు, లాంటివి ప్రయాణం చేయాలంటే నరకం కనబడుతుందని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు గతేడాది సెప్టెంబర్‌లో వచ్చిన బుడమేరు వరదల కారణంగా రోడ్డుకు గండ్లు పడింది. స్థానికులు గండ్లు పడిన చోట తాత్కాలికంగా మట్టి, భవనాల నిర్మాణంలో చెక్క, ముక్కలతో పూడ్చి రాకపోకలు సాగిస్తున్నారు. అంతే తప్పా విజయవాడ నగరపాలక సంస్థ ఆ రోడ్డు అభివృద్ధికి ఎలాంటి చర్యలు చేపట్టలేదని స్థానికులు చెబుతున్నారు.


రహదారి వెడల్పు చేయాలి..

కట్టరోడ్డు ఉండటం వలన వరద నష్టాన్ని కొంతమేర తగ్గించింది. ఆ రోడ్డుకు సమీపంలో ఇళ్ల నిర్మాణాలు జరుగుతుండటం, ఫర్నిచర్ పరిశ్రమలు ఉండటంతో ఇంటి నిర్మాణాలకు అవసరమైన మెటీరియల్స్‌తో వచ్చే వాహనాల రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. ఎదురుగా ఏదైనా వాహనం వస్తే తప్పుకునేందుకు కష్టంగా ఉంటోంది. రోడ్డును వెడల్పు చేస్తే రాజీవ్‌నగర్, కండ్రిక, ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్యకు కొంత ఉపశమనం కలుగుతుందని ప్రజలు అంటున్నారు. రాత్రి వేళల్లో పనులకు వెళ్లి వచ్చే వారు వీధిదీపాలు లేక అవస్థలు పడుతున్నారు. గంజాయి, మద్యం సేవించే వారు కట్టరోడ్డును అడ్డాగా చేసుకొని చెలరేగిపోతున్నారని స్థానికులు చెబుతున్నారు. ఈ సమస్యను పోలీసులకు చెప్పినా పట్టించుకోవడం లేదంటున్నారు. రోడ్డును వెడల్పు చేసి అభివృద్ధి చేయాలని, రోడ్డులో వీఎంసీ విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.



గుంతలమయంగా తారు రోడ్డు

రోడ్డు గుంతలమయం..



మీనాక్షినగర్ రోడ్డు మొత్తం గుంతలు పడి, రోడ్డుకు మధ్యలో పగుళ్లతో ప్రయాణం చేయడానికి వీల్లేకుండా ఉంది. గుంతలను పూడ్చి ప్రజలకు ఉపయోగ పడే విధంగా వీఎంసీ అధికారులు మరమ్మతులు చేయాలి.

– నాగిరెడ్డి, స్థానికుడు, ఉడా కాలనీ

వీధి లైట్లు లేవు..



కట్ట రోడ్డులో మహిళలు వెళ్లలేని పరిస్థితి. మద్యం, గంజాయి సేవించే వారు, బ్లేడ్ బ్యాచ్‌లు ఇక్కడే తిష్ట వేసి ఉంటున్నారు. కనీసం వీధి లైట్లు లేవు. నగరపాలకసంస్థ అధికారులు స్పందించి వీధి లైట్లు ఏర్పాటు చేయాలి.

– కుమారి, స్థానికురాలు, ఉడా కాలనీ

హోంగార్డ్ కుటుంబానికి రూ.లక్ష ఆర్థిక సాయం



బాలుడి తల్లికి చెక్కును అందజేస్తున్న సీపీ రాజశేఖరబాబు

విజయవాడస్పోర్ట్స్: సూర్యారావుపేట పోలీస్ స్టేషన్‌లో హోం గార్డ్‌గా విధులు నిర్వర్తిస్తున్న రాజేష్ కుమారుడి వైద్య ఖర్చుల నిమిత్తం ఎన్టీఆర్ జిల్లా పోలీస్ యంత్రాంగం రూ.లక్ష ఆర్థిక సాయాన్ని అందజేసింది. రాజేష్ ఇంట్లో తన పదేళ్ల కుమారుడు ప్రమాదవశాత్తూ వాటర్ హీటర్‌పై పడి క్షతగాత్రుడయ్యాడు. బాలుడి వైద్య ఖర్చుల నిమిత్తం హోం గార్డ్ వెల్ఫేర్ ఫండ్ నుంచి రూ.25 వేలు, అడ్మిన్ డీసీపీ కె.జి.వి.సరిత, కార్యాలయ పరిపాలన విభాగం రూ.50 వేలు, జిల్లా పోలీస్ గ్రూప్ రూ.25 వేలను సమకూర్చింది. ఈ నగదు చెక్కులను బాలుడి కుటుంబ సభ్యులకు పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు కమిషనరేట్ కార్యాలయంలో బుధవారం అందజేశారు. కార్యక్రమంలో హోం గార్డ్స్ ఆర్ఐ కె.సుధాకరరెడ్డి, జిల్లా పోలీస్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.సోమయ్య, కార్యాలయ పరిపాలనా విభాగ అసోసియేషన్ అధ్యక్షుడు గంగాధర్, సభ్యులు పాల్గొన్నారు.

రేపటి నుంచి సిద్ధార్థ కళాశాల స్వర్ణోత్సవాలు



ఆహ్వాన పత్రికను ఆవిష్కరిస్తున్న మలినేని రాజయ్య, లక్ష్మణరావు, అకాడమీ సభ్యులు

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): అందరికీ విద్య అందించే లక్ష్యంతో సిద్ధార్థ విద్యాసంస్థలను స్థాపించి 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఈ నెల 7 తేదీ నుంచి డిసెంబర్ నెల వరకు స్వర్ణోత్సవాలను నిర్వహిస్తున్నామని సిద్ధార్థ అకాడమీ ఆఫ్ జనరల్ అండ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ పాలక వర్గం అధ్యక్షుడు మలినేని రాజయ్య చెప్పారు. మొగల్రాజపురంలోని సిద్ధార్థ కళాశాల ఆవరణలోని సెమినార్ హాలులో బుధవారం విలేకరుల సమావేశం జరిగింది. రాజయ్య మాట్లాడుతూ.. స్వర్ణోత్సవాలకు ముఖ్య అతిథిగా యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ చైర్మన్ ప్రొఫెసర్ మామిడాల జగదీష్ కుమార్(ఢిల్లీ) హాజరవుతారని చెప్పారు. స్వర్ణోత్సవాల్లో భాగంగా పోస్టల్ కవర్, ప్రత్యేక పోస్టల్ స్టాంపు విడుదల చేస్తామన్నారు. అకాడమీ సంయుక్త కార్యదర్శులు నిమ్మగడ్డ లలితాప్రసాద్, సూరెడ్డి విష్ణు, వీఆర్ సిద్ధార్థ డీమ్డ్ యూనివర్సిటీ ఉపకులపతి, ప్రో చాన్సలర్ ప్రొఫెసర్ పీవీ.రావు, రత్నప్రసాద్, సిద్ధార్థ కళాశాల డైరెక్టర్ వేమూరి బాబూరావు, డిగ్రీ, జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్ మేకా రమేష్, చుండి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

అమెరికన్ యూనివర్సిటీల్లో విద్యార్థులకు ప్రవేశాలు



విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల ఎండీ శారదాదేవి, ప్రసాద్, జీవీ రావు

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): తమ కళాశాలలో సీనియర్ ఇంటర్ ఎంపీసీ చదువుతున్న ఆదిత్య, కీర్తికా, కౌశిక్‌లు అమెరికాలోని ప్రముఖ యూనివర్సిటీల్లో ప్రవేశాలు పొందడంతో పాటు అత్యధికంగా స్కాలర్‌షిప్‌లకు అర్హత సాధించారని శారదా విద్యాసంస్థల చైర్మన్ వై.రమేష్ బాబు చెప్పారు. స్థానిక జమ్మిచెట్టు సెంటర్‌లో ఉన్న కళాశాల ఆవరణలో విద్యార్థులను బుధవారం అభినందించారు. రమేష్‌బాబు మాట్లాడుతూ.. మిరియాల ఆదిత్య, చెరుకూరి కౌశిక్, పాతూరి కీర్తికా బీటెక్‌లో ప్రవేశంతో పాటు వరుసగా ఏడాదికి రూ.2.40 కోట్లు, రూ.1.02 కోట్లు, 10 వేల డాలర్ల స్కాలర్‌షిప్ సాధించారన్నారు. శారదా విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్ వై.శారదాదేవి మాట్లాడుతూ.. ఇన్విక్టా అనే సంస్థతో తాము భాగస్వాములను చేసుకుని ప్రత్యేకమైన శాట్ ప్రోగామ్‌ను విద్యార్థులను అందిస్తున్నామన్నారు. విద్యార్థులను కళాశాల సలహాదారుడు ఈఎస్ఆర్కే.ప్రసాద్, జనరల్ మేనేజర్ జీవీ.రావు, అధ్యాపకులు అభినందించారు.

ఏకగ్రీవంగా ఎంఎస్ఎంఈ చాప్టర్ జనరల్ బాడీ ఎన్నిక

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఎంఎస్ఎంఈ చాప్టర్ జనరల్ బాడీ ఎన్నిక ఏకగ్రీవమైంది. విజయవాడలోని ఎంఎస్ఎంఈ కార్యాలయంలో జరిగిన కార్యవర్గ సమావేశంలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జాతీయ చైర్మన్‌గా దాసరి దేవరాజ్, జాతీయ అధ్యక్షుడిగా ఆర్.వీరారెడ్డి, రాష్ట్ర వైస్ చైర్మన్ శివానంద్, రాష్ట్ర అధ్యక్షుడు బి.సురేంద్ర, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.సాంబశివరావు, జాయింట్ సెక్రటరీ ఏడుకొండలు, ఎగ్జిక్యూటివ్ మెంబర్లు శివ రేణుక బాబు, విజయ్ కిరణ్, రామారావు, నాగ అంజలి ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గం రెండేళ్ల పాటు అమలులో ఉంటుంది. ఈ సందర్భంగా జాతీయ చైర్మన్ దాసరి దేవరాజ్ మాట్లాడుతూ తాము ప్రభుత్వ సేవలను ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు అందించేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తామన్నారు. ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కొత్తగా ఎన్నికైన బృందం ఎంఎస్ఎంఈలకు బలమైన మద్దతుగా వ్యవహరించి, వాణిజ్య రంగంలో పోటీ సామర్థ్యాన్ని పెంచేందుకు, కొత్త వ్యాపార అవకాశాలను అందించేందుకు కృషి చేస్తోందని తెలిపారు.

9న దివ్యాంగులకు ఉచిత అవయవ నమోదు శిబిరం

విజయవాడకల్చరల్: భారత్ వికాస్ పరిషత్ ఆధ్వర్యంలో ఈ నెల 9న టౌన్ బ్రాంచ్ ఆధ్వర్యంలో పాయకాపురం పోలీస్ స్టేషన్ ప్రాంతంలోని భారత వికాస్ పరిషత్ కార్యాలయంలో దివ్యాంగులకు ఉచితంగా అవయవాలను అందించేందుకు శిబిరం నిర్వహిస్తున్నట్లు సంస్థ వన్‌టౌన్ శాఖ అధ్యక్షుడు తేలప్రోలు వీరయ్య, కార్యదర్శి కందం కృష్ణమూర్తి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. అవసరమైన వారికి వీల్‌చైర్స్, ట్రై సైకిళ్లు అందజేస్తామన్నారు. శిబిరంలో పాల్గొనే వారు గుర్తింపు కార్డులతో రావాలని, వివరాలకు 94403 46480, 94401 57750 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): దుర్గాపురం అయ్యప్పస్వామి మందిరంలో బుధవారం శ్రీ మణికంఠ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిగాయి. గురుస్వామి బల్లెం పూర్ణయ్య స్వామికి విశేషంగా పంచామృత అభిషేకం, అర్చనలు, పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. సాయంత్రం భక్తబృందం సభ్యులు అయ్యప్ప భజన నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

14న అయ్యప్ప జన్మ దినోత్సవం

ఈనెల 14వ తేదీ శుక్రవారం అయ్యప్ప జన్మ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు గురుస్వామి బల్లెం పూర్ణయ్యస్వామి తెలిపారు. తెల్లవారుజామున గణపతి పూజతో అయ్యప్ప జన్మ దిన వేడుకలు ప్రారంభమవుతాయన్నారు. స్వామివారికి విశేషంగా 18 ద్రవ్యాలతో కలశాభిషేకం, సహస్ర నామార్చన, హరిహరపుత్ర అయ్యప్పస్వామివారి మూలమంత్ర హోమం పూర్ణాహుతి జరుగుతాయన్నారు. మధ్యాహ్నం 12.30 గంటలకు అన్నప్రసాద వితరణ ఏర్పాటు చేశామన్నారు. భక్తులు అయ్యప్ప జన్మ దిన వేడుకలలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని ఆయన కోరారు.

8న మహిళలకు ఉచిత ఆరోగ్య పరీక్షలు

లబ్బీపేట(విజయవాడతూర్పు): అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని సూర్యారావుపేటలోని ఎంజే నాయుడు హాస్పిటల్‌లో ఈ నెల 8న మహిళలకు ఉచిత ఆరోగ్య పరీక్షలు చేయనున్నట్లు ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ మాధవి ఓ ప్రకటనలో తెలిపారు. అందులో భాగంగా మహిళలకు ఉచిత వైద్య పరీక్షలతో పాటు బీఎండీ పరీక్ష ఉచితంగా నిర్వహిస్తామన్నారు. లేబొరేటరీ పరీక్షలు, ఎంఆర్ఐ అవసరమైన వారికి 50 శాతం రాయితీ కల్పిస్తామన్నారు.

ప్రభుత్వ వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలి

మధురానగర్(విజయవాడసెంట్రల్): ప్రతి ఒక్కరూ ప్రభుత్వ వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని.. నగరంలో నిర్వహిస్తున్న ఎన్‌సీడీ, సీడీ సర్వేలకు సహకరించాలని దుర్గాపురం పట్టణ ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి డాక్టర్ కొడారి సృజన సూచించారు. స్థానిక దుర్గాపురం పట్టణ ఆరోగ్యకేంద్రంలో బుధవారం ఆరోగ్య అవగాహన, వ్యాక్సినేషన్ కార్యక్రమం జరిగింది. ఆమె మాట్లాడుతూ ఆరోగ్య కార్యకర్తలు ప్రతి ఇంటికీ వెళ్లి ఎన్‌సీడీ, సీడీ సర్వే చేసి అవసరమైన వైద్య సేవలు అందిస్తున్నారని తెలిపారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని వైద్యుల సూచనలు సలహాలు పాటించాలన్నారు. అనంతరం గర్భిణులు, చిన్నారులకు వ్యాక్సిన్ వేశారు. కార్యక్రమంలో ఆరోగ్య కేంద్రం సిబ్బంది, ఆశ కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలు, సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో తపస్సు కాల ప్రార్థనలు ప్రారంభం



శిలువను దర్శించుకుంటున్న భక్తులు

గుణదల(విజయవాడతూర్పు): పరిపూర్ణ మనసుతో దేవుని సన్నిధిని సమీపించి ప్రార్థనా జీవితాన్ని గడపటం ద్వారా ఆధ్యాత్మిక మేలు పొందవచ్చని గుణదల మేరీమాత పుణ్యక్షేత్ర రెక్టర్ ఫాదర్ యేలేటి విలియం జయరాజు అన్నారు. విభూతి బుధవారం సందర్భంగా గుణదల మేరీమాత పుణ్యక్షేత్రంలో తపస్సు కాల ప్రార్థనలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ప్రధానాలయంలో ప్రత్యేక సమష్టి దివ్యబలి పూజ సమర్పించారు. భక్తులనుద్దేశించి ఆయన మాట్లాడుతూ, దేవునిపై విశ్వాసం పెంపొందించే దిశగా కతోలిక సంప్రదాయం ప్రకారం తపస్సు కాల ప్రార్థనల ఆచారం మొదలైందన్నారు. క్రీ.శ. 302వ సంవత్సరం నుంచి శ్రీసభ ఈ ప్రత్యేక ప్రార్థనల సంప్రదాయాన్ని కొనసాగిస్తోందన్నారు. కతోలిక క్రైస్తవులు ఈ భస్మ బుధవారం రోజున మాలలు ధరించి పరిపూర్ణ ప్రార్థనా జీవితాన్ని గడుపుతారని తెలిపారు. 40 దినాలను తపస్సు కాలంగా పరిగణిస్తారని పేర్కొన్నారు.

సమష్టి దివ్యబలి పూజ..

దేవుని పట్ల విశ్వాసాన్ని కలిగి తపస్సు కాల ప్రార్థనలు చేయడంతో భక్తులకు ఆధ్యాత్మిక దీవెనలు లభిస్తాయని చెప్పారు. దేవునికి విధేయులుగా ఉంటూ పవిత్రమైన జీవితాన్ని గడపటం ద్వారా జీవితంలో శాంతి సమాధానాలు నెల్కొంటాయన్నారు. దేవుడిని అనుసరించి ప్రేమ, జాలి, దయ, కరుణ వంటి సద్గుణాలు అలవరుచుకోవాలని సూచించారు. శారీరక, మానసిక బలహీనతలను విడిచిపెట్టి దేవునిపై ఆధారపడాలని కోరారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో సమష్టి దివ్యబలి పూజ సమర్పించి భక్తులకు సత్ప్రసాదాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వందలాది మంది భక్తులు శిలువ మాలలను ధరించారు. కార్యక్రమంలో పుణ్యక్షేత్ర గురువులు, పెద్ద సంఖ్యలో క్రీస్తు విశ్వాసులు హాజరయ్యారు.

మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలి

ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్



మాట్లాడుతున్న ఉమామహేశ్వరరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): టీడీపీ కూటమి ప్రభుత్వం ఆప్కాస్ వ్యవస్థను రద్దు చేసి ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని ప్రైవేటు ఏజెన్సీలకు కట్టబెట్టే చర్యలు తక్షణమే విడనాడాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ డిమాండ్ చేసింది. పారిశుద్ధ్యం, ఇంజినీరింగ్, ఎస్.ఎం.ఆర్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేసింది. బుధవారం విజయవాడ అలంకార్ సెంటర్‌లోని ధర్నా చౌక్‌లో ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఆప్కాస్ రద్దు, ప్రైవేటు ఏజెన్సీలు వద్దు, ఉద్యోగాలు పర్మినెంట్ కావాలి, సమ్మె కాలపు ప్రభుత్వ హామీలకు జీవోలు వెంటనే జారీ చేయాలి వంటి డిమాండ్ల పరిష్కారానికై మహాధర్నా నిర్వహించారు.

ఫైల్స్ వెనక్కి పంపడం దుర్మార్గం..

ఈ సందర్భంగా జరిగిన సభలో ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ ఇతరులు ఎవరూ చేయలేని విధులు నిర్వహిస్తున్న మున్సిపల్ పారిశుద్ధ్య, ఇంజనీరింగ్ కార్మికుల సేవలను గుర్తించకుండా ప్రభుత్వం వెట్టిచాకిరీ చేయిస్తోందని విమర్శించారు. తమ ప్రాణాలను పణంగా పెట్టి పట్టణాల పరిశుభ్రత, ప్రజారోగ్యం, పర్యావరణాన్ని పరిరక్షిస్తున్న మున్సిపల్ కార్మికుల సేవలు ఎనలేనివని ఆయన కొనియాడారు. టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తమ జీవితాలు బాగుపడతాయని మున్సిపల్ కార్మికులు ఆశించారన్నారు. ఆప్కాస్ రద్దుచేసి ఉద్యోగాలు పర్మినెంట్ చేస్తోందని, ఇందుకు అనుగుణంగా ప్రస్తుత బడ్జెట్ సమావేశాల్లో తీర్మానం చేస్తోందని ఎదురు చూసిన కార్మికులకు నిరాశే మిగిలిందన్నారు. గత 17 రోజుల సమ్మె సందర్భంగా నాడు ప్రభుత్వం అంగీకరించిన హామీలకు జీవోలు ఇవ్వకుండా ఫైల్స్ ఆర్థిక శాఖ నుంచి వెనక్కి పంపడం దుర్మార్గమన్నారు. పర్మినెంట్ కార్మికులకు డీఏ బకాయిలు, సరెండర్ లీవులు చెల్లించడంలేదని, జీపీఎఫ్ ఖాతాలు ప్రారంభించ కుండా వేధిస్తున్నారని మండిపడ్డారు.

సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి ఎస్‌సీహెచ్ శ్రీనివాస్, సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు టి.నూకరాజు, కె.సామ్రాజ్యం, బి.సోమయ్యలు మాట్లాడుతూ.. ఇంజినీరింగ్ కార్మికులకు పారిశుద్ధ్య కార్మికులతో సమానంగా జీతాలు చెల్లించకుండా పాలకులు దగా చేస్తున్నారన్నారు. పట్టణాలు విస్తరిస్తున్నా కార్మికుల సంఖ్య పెంచకుండా కార్మికులపై అదనపు భారాలు మోపి వేధింపులకు గురిచేస్తున్నారన్నారు. మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందించి తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించకపోతే రాష్ట్ర వ్యాప్త ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. సభలో సంఘం రాష్ట్ర కోశాధికారి ఎస్.జ్యోతిబసు, రాష్ట్ర నాయకులు ఉరికూటిరాజు, ధనాల వెంకట్రావ్, ఎస్.నాగరాజు, నాగేంద్రబాబు, ఎస్.బలరాం, కె.శ్రీనివాసరావు, కామక్షమ్మ, సంఘయ్య, సాల్మన్,పి.ఆదామ్ కె.వెంగమ్మ, బి.వి.రమణ, మల్లిఖార్జున్, తిరుమలరావు, బాబు, ప్రవీణ్, సుంకర రవి, జి.అప్పారావు, ఎ.జాన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

శివపురాణ పఠనం భక్తి ముక్తిదాయకం

విజయవాడకల్చరల్: శివపురాణ పఠనం భక్తి ముక్తి దాయకమని ఆధ్యాత్మికవేత్త చింతలపాటి వేంకటేశ్వర శాస్త్రి తెలిపారు. శృంగేరీ జగద్గురువులు భారతీ తీర్థ మహాస్వామి వర్ధంతి సందర్భగా దుర్గాపురంలోని శివరామకృష్ణ క్షేత్రంలో బుధవారం శివపురాణం అంశంగా ప్రసంగించారు. భగవాన్ వ్యస మహర్షి మనకు అనంతమైన ఆధ్యాత్మికమైన సంపదను పురాణాల రూపంలో మనకు అందించారన్నారు. అవి సనాతన భారతీయ ఆధ్యాత్మిక వైభవానికి గుర్తులని చెప్పారు. పరమేశ్వరుడు భక్తవల్లభుడన్నారు. ఓం నమః శివాయ మంత్రం సర్వరోగ నివారణిగా అభివర్ణించారు. ధర్మాధికారి శ్లిష్టా హనుమత్ ప్రసాద్ మాట్లాడుతూ శృంగేరీ పీఠం వేద సంస్కృతి పరిరక్షణకు కట్టుబడి ఉందన్నారు. భారతీ తీర్థ స్వామి వర్ధంతి సందర్భంగా లోక కల్యాణార్థం నవచండీ పారాయణ, చండీహోమం నిర్వహించామని చెప్పారు.